09082024-MAI-06_Layout 1 8/9/2024 3:33 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కంచికి చేరని కేసులు

కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ఇటీవలి కాలంలో పదేపదే వార్తలకెక్కుతున్నది. ఇది ఆ సంస్థ సాధించిన విజయాల వల్ల కాకుండా, సందేహాస్పద పాత్ర వల్ల కావడం గమనార్హం. గత పదేండ్ల గణాంకాలు గమనిస్తే ఈడీ కేసుల పస ఏమిటో తేటతెల్లమవుతుంది. స్వయంగా కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటుకు సమర్పించిన లెక్కల ప్రకారం.. 2014-24 మధ్యకాలంలో మనీలాండరింగ్ చట్టం కింద మొత్తం 5,297 కేసులను ఈడీ దాఖలు చేస్తే అందులో రుజువైనవి 40 మాత్రమే. అంటే సక్సెస్ రేటు 1 శాతం లోపేనన్నమాట. మిగిలిన కేసులు, వాటిల్లో అరెస్టయినవారి పరిస్థితి ఏమిటనేది ఆలోచించాల్సిన విషయం. ఈ వివరాలను కేంద్రం పార్లమెంటుకు సమర్పించిన బుధవారం రోజే సుప్రీంకోర్టు కూడా ఇదే అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. వేల సంఖ్యలో కేసులుంటే రుజువైనవి పిడికెడు కూడా లేకపోవడం ఏమిటని దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్యాప్తు తీరు మెరుగుపర్చుకోవాలని గట్టిగా మందలించింది.

ఇంతకూ ఈడీ కేసుల్లో లోపం ఎక్కడుంది? ఆ మధ్య ఓ న్యాయని పుణుడు ఈడీ బండారాన్ని పూసగుచ్చినట్టు బయటపెట్టారు. ముందుగా ఓ నలుగురైదుగురిని ఈడీ అరెస్టు చేస్తుంది. వారిలో ఒకరు తర్వాత అప్రూవర్‌గా మారుతారు. మిగతా వారికి వ్యతిరేకంగా మౌఖికంగా సాక్ష్యమిస్తారు. ఆ వాంగ్మూలం ఆధారంగా మిగతావారి మీద కేసు పెడతారు. నికరంగా శాస్త్రీయమైన ఆధారాలు లేకుండా ఇలా మౌఖిక సాక్ష్యాలపై ఆధారపడటాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ముందుగా అరెస్టు చేసి తర్వాత తాపీగా సాక్ష్యాధారాల కోసం వెతకడమనే విలోమ పద్ధతి వల్ల కేసులు నిలబడటం లేదనేది జగమెరిగిన సత్యం. పైగా అవినీతి అంతుచూస్తామని దూకుడు చూపే ఈడీలోనే అవినీతిపరులు పట్టుబడుతుండటం సంస్థలోని వారంతా కడిగిన ముత్యాలేమీ కాదని తెలియజేస్తున్నది. తాజాగా ఓ సీనియర్ ఈడీ అధికారి నిందితుని నుంచి రూ.20 లక్షల లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన ఘటన సంస్థ పరువును బజారుకీడ్చింది. గతేడాది తమిళనాడులోనూ లంచం కేసులోనే ఈడీ అధికారి అరెస్టు కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ లక్ష్యాల సాధనకు ఈడీ ఓ ఆయుధంలా మారిందనే ఆరోపణలు మొదటినుంచీ ఉన్నాయి. రాజకీయాల్లో అవినీతి ప్రక్షాళనకే ఈడీని ప్రయోగిస్తున్నామని పాలక బీజేపీ అంటుంటే, దారికి రానివారిని లొంగదీసుకునేందుకే ఆ దర్యాప్తు సంస్థను ఉసిగొల్పుతున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈడీ వ్యవహారశైలి, కేసులు చతికిలబడుతున్న తీరే అందుకు నిదర్శనం. కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రవేశపెట్టడమే ఈ సమస్యకు పరిష్కారం. పార్లమెంటరీ కమిటీ పర్యవేక్షణ తప్పనిసరి చేయాలి. ఆ కమిటీ ముందు సంస్థల బాధ్యులు ఎప్పటికప్పుడు హాజరై వాంగ్మూలాన్ని సమర్పించే సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టాలి. ఆ మొత్తం వ్యవహారాన్ని ప్రసార మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయాలి. అప్పుడే కేసుల నిగ్గు తేలుతుంది. దర్యాప్తు సంస్థల పనితీరూ మెరుగుపడుతుంది. దేశ ప్రజలకు నమ్మకమూ పెరుగుతుంది.

వర్గీకరణపై జాతీయ పార్టీల జాప్యమేల?

నాంచారయ్య మెరుగుమాల

దేశ ప్రజలకు సంబంధించిన అనేక అంశాలపై తమకు మాత్రమే స్పష్టమైన దృక్పథం ఉంటుందని, కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన ప్రాంతీయ పక్షాలకు వాటిపై అవగాహన ఉండదని పదే పదే చెప్పుకొనే జాతీయపక్షాలు తమ అవకాశవాద వైఖరిని మరోసారి బయట పెట్టుకుంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో సీట్ల రిజర్వేషన్ల విషయంలో అనుసూచిత కులాలను (ఎస్సీలు) ఏబీసీడీలుగా వర్గికరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి వారం దాటిపోయింది. కానీ, బీజేపీ, కాంగ్రెస్ జాతీయస్థాయిలో దీనిపై తమ వైఖరిని ఇంతవరకు వెల్లడించలేదు.

దాదాపు ఐదున్నర దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్, 16 ఏండ్లకు పైగా ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీలకు వివిధ అంశాలపై అవకాశవాదానికి చోటులేని జాతీయ దృక్పథం లేదని ఎస్సీల వర్గీకరణ అంశంలో రుజువవుతోంది. అలాగే, ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీలు) కోటాల విషయంలో మాదిరిగానే ఎస్సీల రిజర్వేషన్ అమలులోనూ క్రీమీలేయర్‌ను మినహాయించే విషయమై పై తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన సూచనపై కనీసం మాట్లాడడానికి కూడా ఈ రెండు జాతీయ పార్టీలు సిద్ధంగా లేవు. వాస్తవానికి కోటాల వర్గీకరణ లేదా ఉప వర్గీకరణ అనేది ఉత్తరాదిన పంజాబ్, హర్యానా, బీహార్, పశ్చిమాన మహారాష్ట్ర, దక్షిణాదిన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మాత్రమే మూడు దశాబ్దాలకు పైగా నలుగుతున్న సమస్య. ఈ ఎస్సీల కోటా వర్గీకరణ వివాదాన్ని అన్ని పక్షాలతో సంప్రదింపులు జరిపి సామరస్యపూర్వకంగా పరిష్కరించే వీలున్నా కాంగ్రెస్, బీజేపీలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరున అవకాశవాద వైఖరిని అవలంబిస్తున్నాయి. తరతరాలుగా సామాజిక అణచివేతకు గురైన దళితులను వర్గాలుగా చీల్చి ఎన్నికల్లో తమ ప్రయోజనాలకు అనుగుణంగా 1990ల నుంచీ ఇవి రాజకీయాలను నడుపుతున్న విషయం దేశ ప్రజలకు తెలియని రహస్యమేమీ కాదు. ఎస్సీల వర్గీకరణ విషయంలో బీఆర్ఎస్ వంటి దక్షిణాది పార్టీలకున్న సూత్రబద్ధ వైఖరి దశాబ్దాలుగా దేశాన్ని పాలించే రెండు జాతీయపక్షాలకు లేకపోవడం విచారకరం.

దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత ఆయన కొడుకు రాహుల్‌గాంధీ నేడు కులగణన ఎజెండాను సామాజిక న్యాయ పార్టీలుగా పేరొందిన తన మిత్రపక్షాలైన ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ నుంచి గుంజుకుని ఓబీసీ రక్షకుడిగా కొత్త అవతారమెత్తి హస్తినలో అధికారం కోసం వెంపర్లాడుతున్నారు.

వర్గీకరణపై ఉత్తరాది, దక్షిణాది ఎస్సీలలో భిన్నాభిప్రాయాలు:

కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి దక్షిణాది రాష్ట్రాలకు భిన్నంగా హర్యానా, పంజాబ్, బీహార్, మహారాష్ట్రలో చర్మకార వృత్తిపై ఆధారపడిన ఎస్సీ కులాలవారు దాదాపు అన్ని రంగాల్లో మిగిలిన దళిత వర్గాల కన్నా మెరుగైన స్థితిలో ఉన్నారు. ఈ కారణంగా ఉత్తరాది చర్మకార కులాలైన చమార్లు లేదా జాటవుల మద్దతు మెండుగా ఉన్న బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) దళితుల కోటా వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో ఒకటైన లోక్‌జన్ శక్తి పార్టీ (ఎల్జేపీ) కూడా సుప్రీంకోర్టు తీర్పు అమలుకు సుముఖంగా లేదనే వార్తలొస్తున్నాయి. దివంగత దళిత నేత రామ్‌విలాస్ పాశ్వాన్ కుమారుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నాయకత్వం వహిస్తున్న ఈ పార్టీకి ప్రధానంగా వారి కులస్తులైన దుసాధులు (పాశ్వాన్లు) ఎక్కువగా మద్దతు పలుకుతున్నారు. తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని ఎస్సీల్లో అధిక సంఖ్యలో ఉన్న దుసాధులు దళిత వర్గాల్లో కాస్త మెరుగైన స్థితిలో ఉన్నారు. అందుకే ఎస్సీల వర్గీకరణను ఎల్జేపీ లోపాయికారిగా వ్యతిరేకిస్తోంది. అదీగాక, 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఎస్సీల ఓట్లను కనీస సంఖ్యలో కూడా దక్కించుకోలేకపోయిన బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉన్న ఎస్సీ వర్గీకరణను తేనెతుట్టెగా పరిగణించడం కూడా దాని నాన్చుడు ధోరణికి ప్రధాన కారణం. అయోధ్యలో రాముడి గుడి కట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనుకున్న కాషాయపక్షానికి ఈ పుణ్యక్షేత్రం ఉన్న ఫైజాబాద్ పార్లమెంటు సీటులోనే సమాజ్‌వాదీ పార్టీ నిలబెట్టిన దళిత అభ్యర్థి చేతిలో ఓటమి ఎదురవడం కూడా కోలుకోలేని దెబ్బ. ఈ నేపథ్యంలో ఎస్సీల వర్గీకరణను సుప్రీంకోర్టు చెప్పినట్టు రాష్ట్రాల వ్యవహారంగా పరిగణించి, ఈ ఏడాది జరిగే నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోపు తన జాతీయ వైఖరిని చెప్పకుండా దాటవేయాలని బీజేపీ కేంద్ర నాయకత్వం చూస్తోంది. ఆ పార్టీ నేతల మాటల ద్వారా ఈ విషయం అవగతమవుతున్నది. దీనికి తోడు ఎస్సీల కోటా అమలులోనూ 'సంపన్న శ్రేణి' నియమం పాటించే విషయంపై ఆలోచించాలన్న సుప్రీంకోర్టు తీర్పును ఉత్తరప్రదేశ్, బీహార్ నేతలు బాహాటంగా వ్యతిరేకిస్తుండటం కమలం పార్టీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును ఇరుకున పెడుతోంది.

కోటాల విషయంలో పచ్చి అవకాశవాదానికి మారుపేరు కాంగ్రెస్:

1990లో వీపీ సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఓబీసీలకు తొలిసారిగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో 27 శాతం కోటా కల్పించింది. అప్పుడు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ తాను కన్నుమూసే వరకు అదే వైఖరిని అవలంబించారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత ఆయన కుమారుడు రాహుల్‌గాంధీ కులగణన ఎజెండాను సామాజిక న్యాయ పార్టీలుగా పేరొందిన తన మిత్రపక్షాలైన ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ నుంచి గుంజుకుని ఓబీసీ రక్షకుడిగా కొత్త అవతారమెత్తి హస్తినలో అధికారం కోసం వెంపర్లాడుతున్నారు. అయితే, ఆయన చెప్పుచేతల్లో నడిచే కాంగ్రెస్ కూడా బీజేపీ బాటలో పయనిస్తూ ఎస్సీల వర్గీకరణపై జాతీయ వైఖరిని వెల్లడించడం లేదు.

మంగళవారం ఢిల్లీలో అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీలతో సమావేశమైన కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై ఇంకా చర్చించాల్సి ఉందని, త్వరలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులతో సమావేశమై పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుంటామని ప్రకటించారు.

వాస్తవానికి కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ నాయకులు వర్గీకరణకు అనుకూలంగా ఉండగా, చర్మకార వృత్తి నేపథ్యం ఉన్న కులాల నుంచి వచ్చిన హర్యానా, యూపీ నేతలు కుమారీ సెల్జా, పన్నాలాల్ పునియా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలుస్తున్నది. ఈ ఇద్దరు నేతలు హరియానా, పంజాబ్‌లో మూలాలున్న చర్మకార జాటవ్ కుటుంబాల్లో జన్మించినవారే. గతంలో యూపీ నుంచి లోక్‌సభ, రాజ్యసభకు ఎన్నికైన పునియా 2010 నుంచి 2016 వరకు జాతీయ అనుసూచిత కులాల (ఎస్సీ) కమిషన్ అధ్యక్ష పీఠంపై కూర్చొని ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1977 వరకు నిరాటంకంగా కేంద్రంలో రాజ్యమేలిన కాంగ్రెస్ సామాజిక విషయాల్లో బీజేపీ కన్నా కాస్త ముందుండాల్సింది పోయి, ఎస్సీల వర్గీకరణ వ్యవహారంలో అన్ని లెక్కలు బేరీజు వేసుకుని నడవాలనుకోవడం దాని తాజా అవకాశవాద వైఖరికి అద్దం పడుతోంది.

ఎన్నికల్లో ప్రయోజనాలే రెండు జాతీయపక్షాలను నడిపించే ఏకైక ఎజెండా:

తమకు అత్యధిక రాష్ట్రాల్లో ఉనికి ఉందని, అంతర్జాతీయ, జాతీయ విషయాల్లో తమకు మాత్రమే సుస్పష్ట అవగాహన ఉందని చెప్పుకొనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వేలాది కులాలున్న ఇండియాలో ప్రతి సామాజిక వివాదాన్ని ఓట్లు దండుకోవడానికి సాధనంగా మలచుకోవడం ఆనవాయితీగా మారింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మాత్రమే ఎస్సీల జాబితాలో కొత్తగా కులాలను చేర్చే పకడ్బందీ రాజ్యాంగ ఏర్పాటు ఉన్న మన దేశంలో తరతరాలుగా సామాజిక దోపిడీకి గురైన దళిత కులాల మధ్య పేచీ వచ్చినప్పుడు సామరస్య వాతావరణంలో పరిష్కారాలు కనుగొనడం ఉత్తమ మార్గం. వర్గీకరణ వంటి వివాదాలు తలెత్తినప్పుడు అన్ని రాజకీయపక్షాలూ సుప్రీంకోర్టుకు పరిష్కార బాధ్యత అప్పగించి, తీర్పు వచ్చాక జాప్యం చేసే ధోరణి అవలంబించడం పూర్తిగా బాధ్యతారాహిత్యం అవుతుంది.

అన్ని ఎస్సీ కులాల నేతల మధ్య ఏకాభిప్రాయ సాధనకు, ఎస్సీల వర్గీకరణ వంటి కీలక విషయంపై ఆచరణాత్మక విధానం రూపొందించడానికి ప్రాంతీయపక్షాలు సహా అన్ని రాజకీయ పార్టీల మధ్య అంగీకారం కుదర్చడానికి రెండు జాతీయపక్షాలు చొరవ తీసుకునే సూచనలు ప్రస్తుతానికి కనిపించడం లేదు. 'ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించింది కాబట్టి, జాతీయ పక్షాలకు ఎస్సీల వర్గీకరణ అమలుపై తొందరెందుకు?' అనే బీజేపీ, కాంగ్రెస్‌ల ధోరణి దేశ ప్రయోజనాలకు, సామాజిక సామరస్యానికి అత్యంత హానికరమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

వినేశ్.. మా కోహినూర్ వజ్రం

ఫిజిక్స్ అరుణ్ కుమార్
93947 49536

'కుస్తీ నాపై గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించండి. మీ కల, నా ధైర్యం విచ్ఛిన్నమయ్యాయి. ఇక నాకు పోరాడే బలం లేదు. మీ అందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటా' అంటూ మీ (వినేశ్ ఫోగాట్) సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో మీరు చేసిన పోస్టును చూసి బరువెక్కిన హృదయంతో బాధపడుతున్న యావత్ భారతం మరింత భావోద్వేగ సాగరంలో మునిగిపోయింది. ఈ సందర్భంగా మీకు కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నా.

వినేశ్ ఫోగాట్.. మీకు వినిపిస్తోందా? మన దేశ రాష్ట్రపతి, ప్రధాని, ప్రతిపక్ష నేతలతో మొదలు విభిన్న రంగాల్లోని ప్రముఖులు, సగటు భారతీయులు సహా అందరూ.. ఒక్క మాటలో చెప్పాలంటే యావత్ దేశం మీ ప్రతిభ, పోరాటస్ఫూర్తిని కీర్తిస్తోంది. మీరు మా కోహినూర్ వజ్రం.

మీపై విధి ఎన్ని కత్తులు దూస్తేనేమి, కాలం మీ పట్ల మరీ ఇంత కఠినంగా వ్యవహరించడమేంటి? రెండు దశాబ్దాల మీ పట్టుదల, సంకల్పం ముందు ఒలింపిక్ పతక ప్రభావం మాకు చాలా చిన్నది. ఈ దేశంలో రెజ్లింగ్ క్రీడలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తూ నడిరోడ్డుపై మీరు చేసిన పోరు, విశ్వక్రీడా వేదికపై ఈ దేశాన్ని గెలిపించేందుకు మైదానంలో మీరు చేసిన పోరాటం రెండింటినీ మేం చూశాం. మీ ఆటకు సెల్యూట్ చేసి మా హృదయ సామ్రాజ్యాలలో మిమ్మల్ని అత్యున్నత పీఠంపై కూర్చోబెట్టాం. మా అందరికీ మీరే సూపర్ హీరో. వంద గ్రాముల అనర్హత గురించి మాకెందుకు? ఒలింపిక్స్ నిబంధనలు ఏం చెబితే మాకెందుకు? తొలి మ్యాచ్‌లోనే విశ్వ విజేతను మట్టి కరిపించి మా హృదయాలను మీరు గెలిచారు. ఇక పతకాలు.. కుట్రలు, కుతంత్రాలతో కూడిన పథకాల గోల మాకెందుకు? మండుతున్న మీ కన్నీటి సెగకు భయపడి ఓటమి ఏనాడో పారిపోయింది. మిమ్మల్ని ఓడించలేకే ఆటలో ఆడనీయకుండా వంద గ్రాముల అనర్హత పేరు చెబుతోంది!

విభిన్న భాషలు, రాజకీయ పార్టీలు, మతాలు, సంస్కృతుల సమ్మేళనంతో కూడిన 145 కోట్ల జనాభా కలిగిన అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. ఘన చరిత్ర గల ఈ దేశంలో ఒలింపిక్స్ పోటీల్లో కనీసం డబుల్ డిజిట్ పతకాలు సాధించడానికి దశాబ్దాలుగా ఎంతగానో శ్రమిస్తున్నాం. అలాంటి దేశం తరపున ఒక (అ)సాధారణ అమ్మాయి పురుషులకే ప్రత్యేకమైనదిగా భావించే రెజ్లింగ్‌లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించడమే గొప్ప విజయం. అసమానతలు, వివక్ష, అన్యాయాలపై అలుపెరగని పోరాటం చేస్తూ.. విమర్శలు, అవాంతరాలు, రాజకీయ కుతంత్రాలను ప్రతిఘటిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జాతీయ జెండాను రెపరెపలాడించడమే కాకుండా మూడుసార్లు ఒలింపిక్స్‌కు ప్రాతినిధ్యం వహించడం అసాధారణ విజయం. అదే మాకు బంగారంతో సమానం. టోక్యో ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్‌లో పోరాడి ఓడిన, రియో ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్‌లో తీవ్ర గాయాలతో నిలబడలేని స్థితిలో దేశానికి తిరిగొచ్చిన దృశ్యాలు ఇప్పటికీ మా కండ్ల ముందే కదలాడుతున్నాయి.

ఈ ఒలింపిక్స్‌లో మన దేశాన్ని గెలిపించడం కోసం 57 కేజీలు ఉండే మీరు 50 కేజీల విభాగంలో పోటీ పడేందుకు ఎంత కష్టపడ్డారో మీ ఆటను చూస్తే అర్థమైంది. అంచనాలు లేకుండా బరిలో దిగి ఛాంపియన్లకు చెక్ పెడుతూ ఫైనల్‌కు చేరడమంటే మాటలు కాదు. అందుకు శారీరక, మానసిక దృఢత్వం, సంసిద్ధత, దేశం పట్ల ఎనలేని అంకిత భావం ఉండాలి. మీ శ్రమ ఎప్పటికీ వృథా కాదు. కాలం చేసే మాయాజాలంలో ఏమైనా జరగొచ్చు.

దాదాపు రెండు దశాబ్దాలుగా వివిధ ప్రైవేటు విద్యాసంస్థల్లో 6వ తరగతి నుంచి డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వరకు గణిత ఉపాధ్యాయుడిగా, భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా నేను సేవలందిస్తున్నాను. ఈ క్రమంలో వివిధ సందర్భాల్లో ఎంతోమంది మహనీయుల జీవితాల గురించి విద్యార్థులకు చెప్తూ వారికి స్ఫూర్తినిచ్చాను. ఐన్‌స్టీన్‌ను ఒకప్పుడు ఈ ప్రపంచం పిచ్చోడంది. విద్యుత్ బల్బు కనుగొనడం కోసం ఎడిసన్ చేసిన వందల ప్రయత్నాలను చూసి ప్రపంచం ఎగతాళి చేసింది. అమ్మాయిలకు ఉన్నత చదువులు చదివేందుకు అర్హత లేదని చెప్పినా వినకుండా ముందుకుసాగిన మేడం క్యూరీ రెండు నోబెల్ బహుమతులను గెలిచింది. బక్కపలుచని గాంధీ మన దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చారు. అంతేకాదు, యావత్ ప్రపంచంపై అహింస ముద్ర వేశారు. వరల్డ్ కప్ అందుకోవడమే స్వప్నంగా క్రికెట్ ఆడిన సచిన్ 2003 ఫైనల్లో ఓడినప్పటికీ కుంగిపోలేదు. తిరిగి పుంజుకొని 2011లో ఇండియాను విశ్వ విజేతగా నిలిపారు. రేపటి నుంచి మీ జీవిత కథ కూడా గెలుపోటములకు అతీతంగా కోట్లాది మందికి ప్రేరణనిస్తుంది. మీరు పోరాటానికి పాట అయ్యారు. భవిష్యత్తు భారతానికి పాఠమయ్యారు.

వినేశ్.. వింటున్నారా..! 'వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్‌వి. దేశానికి గర్వకారణం. ప్రతి భారతీయుడికీ స్ఫూర్తివి నువ్వు. ఈరోజు తగిలిన ఎదురుదెబ్బ బాధ కలిగించేదే. దీనివల్ల కలిగిన నిరాశను మాటల్లో చెప్పలేకపోతున్నా. అదే సమయంలో అడ్డంకులను అధిగమించే నీ సత్తా నాకు తెలుసు. సవాళ్లను స్వీకరించడమే నీ నైజం. తిరిగి బలం పుంజుకో. మేమందరం నీకు అండగా ఉన్నాం'.. మన ప్రధాని మోదీ మీకిచ్చిన సందేశమిది. ఇది ప్రధాని మాటే కాదు, ప్రతి భారతీయుడి హృదయ స్పందన.

వినేశ్.. మిమ్మల్ని చూసి ఈ దేశం గర్విస్తోంది. మీరంటే మాకు ఎనలేని గౌరవం. ఏమైనా జరగనీ.. మీకు మేము తోడుంటాం. మీ స్ఫూర్తితో మా జీవిత పోరాటంలో గెలుపోటములకు అతీతంగా ముందడుగేస్తాం. మాకు మీ ఫలితాల ద్వారా వచ్చే పతకాల కంటే మీ ప్రయాణపు ప్రకాశమే ఆదర్శం.

కేంద్రం ఎందుకు మౌనం వహిస్తున్నది?

ముందు రోజు మూడు మ్యాచ్‌లు గెలిచినప్పుడు వినేశ్ బరువు 50 కిలోలే. ఒకవేళ తర్వాతి రోజు ఆమె బరువు 50 కిలోల కంటే ఎక్కువ ఉండి ఉంటే.. దాని ప్రభావం ముందు రోజు మ్యాచ్ ఫలితాలపై ఎలా పడుతుంది? అసలు ఈ విషయంపై భారత ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తున్నది. ఒలింపిక్ పతకం వినేశ్‌ది మాత్రమే కాదు, యావత్ దేశానిది. ఈ విషయాన్ని బీజేపీ అర్థం చేసుకోవాలి.

- రణదీప్ సూర్జేవాలా, కాంగ్రెస్ ఎంపీ

ప్రపంచవ్యాప్తంగా చూసినా, భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని పరిశీలించినా, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రాన్ని చూసినా.. అవన్నీ ఒకనాడు దట్టమైన కారడవులు, కొండకోనలు కలిగిన ప్రాంతాలే. ఆధునిక ప్రపంచంలో ప్రస్తుతం మనకు కనిపిస్తున్న నగరాలు, పట్టణాలన్నీ ఒకప్పుడు చెట్లు, పుట్టలతో నిండిన అటవీ ప్రాంతాలే. మనం ఇప్పుడు చూస్తున్న నాగరికతకు కొండకోనలు, అడవుల్లో నివసించే ఆదివాసీ గిరిజనులే మూలం. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆదివాసీ గిరిజనులను గుర్తిస్తూ, వారి ఆత్మగౌరవం ప్రతిబింబించేలా ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకోవడం మనమందరం గర్వించదగ్గ విషయం.

ఆదివాసీలకు అండగా బీఆర్ఎస్

ఎల్.రూప్‌సింగ్
90005 00760

ఆదిమానవుల నుంచి నేటి ఆధునిక సమాజం వరకు అందరికీ జీవనమార్గం చూపింది ఆదివాసీ గిరిజనులే. చక్రాన్ని కనుగొని ఆధునిక చరితకు నాంది పలికింది వారే. ఎడ్లబండ్లను తయారు చేసి రవాణాకు మార్గం సుగమం చేసింది వారే. చివరికి బ్రిటిష్ పాలకులను గడగడ వణికించి స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరిపోసింది వారే. చరిత్ర దాచినా దాగని నగ్నసత్యమిది.

యుగాలు మారాయి, కాలాలు మారాయి. కానీ, ఆదివాసీ గిరిజనుల బతుకులు మాత్రం మారలేదు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వారి స్థితిగతులను పరిశీలించాలని 1982లో ఐరాస నిర్ణయించింది. పదేండ్ల పాటు వివిధ దేశాలు తిరిగిన ప్రతినిధి బృందం 1992లో నివేదికను ఐరాసకు సమర్పించింది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడాలని, వారి అభ్యున్నతికి పాటుపడాలనే ఉద్దేశంతో ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ఐరాస ప్రకటించింది.

2011 జనాభా లెక్కల ప్రకారం.. మన దేశంలో మొత్తం జనాభాలో 8 శాతం ఆదివాసీ గిరిజనులున్నారు. 500కు పైగా తెగలు, సమూహాలు, 705 భాషలను భారత ప్రభుత్వం గుర్తించింది. వారి సమగ్రాభివృద్ధికి ఐటీడీఏలను ఏర్పాటు చేసింది. కానీ, సమైక్య పాలకుల నిర్వాకం వల్ల అభివృద్ధికి ఆమడదూరంలోనే ఆదివాసీ గిరిజనులు నిలిచిపోయారు. 1952లో షెడ్యూల్డ్ ట్రైబ్స్‌ను ఆదివాసీలుగా రాజ్యాంగం గుర్తించింది. ఉమ్మడి పాలకులు మాత్రం ఆంధ్ర ప్రాంతంలోని బంజారాలను ఎస్టీలుగా గుర్తించి, తెలంగాణవారిని విస్మరించారు. 1976లో తెలంగాణ ఆదివాసీలకు ఎస్టీలుగా గుర్తింపు దక్కింది. దీంతో 20 ఏండ్ల పాటు వారికి రాజ్యాంగ ఫలాలు అందలేదు.

అంతేకాదు, గ్రామ పంచాయతీలలో తండాలు, గూడేలు, చెంచుపేటలు భాగంగా ఉండటం వల్ల అవి అభివృద్ధికి నోచుకోలేదు. ఆయా ప్రాంతాలకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేదు. దీంతో ప్రసవ సమయాల్లో మహిళలు పురిటినొప్పులతోనే కాలినడకన, ఎండ్ల బండ్ల మీద, మంచాలపై దయనీయమైన స్థితిలో ప్రయాణించాల్సి వచ్చేది. సమయానికి వైద్యం అందక చాలామంది మరణించేవారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత భయానకంగా ఉండేది. వైద్యశాలలు అందుబాటులో లేకపోవడంతో విషజ్వరాలు, రోగాల బారిన పడి అనేకమంది మరణించేవారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు అందుబాటులో ఉండేవారు కాదు.

అడవులే జీవనాధారంగా పోడు వ్యవసాయం చేసుకొని బతికే ఆదివాసీ గిరిజనులకు భూ పట్టాలిచ్చి ఆదుకోవాల్సిన పాలకులు వారి పట్ల అమానుషంగా వ్యవహరించేవారు. అటు ఫారెస్టు అధికారులతో, ఇటు రెవెన్యూ అధికారులతో అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేసేవారు అప్పటి పాలకులు. అంతేకాదు, జైళ్లలో పెట్టి వారి కుటుంబాలను చిన్నాభిన్నం చేసేవారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లను కూడా సరైన రీతిలో సమైక్య పాలకులు నిర్వహించకపోవడంతో ఆదివాసీల బతుకులు ఆగమాగమయ్యాయి.

ఈ నేపథ్యంలో ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ విధాత, స్వరాష్ట్ర సాధకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆదివాసీ బిడ్డల కష్టాలను దగ్గర్నుంచి చూసిన ఆయన వారి గోసను తీర్చాలని సంకల్పించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆదివాసీ గిరిజనుల చిరకాల ఆకాంక్ష (మా తండాలో– మా రాజ్యం, మావనాటే– మావరాజ్)ను నిజం చేశారు. తండాలు, గూడేలు, చెంచు